

మార్కెట్లో రైతుల గోస

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

- 8లో▸



బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

41°/28°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.

ఇఫ్తార్ శుక్ర 6:37 | **సహర్** శని 4:36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రామాలయంలో చోరీ



ఖానాపురం: మండలంలోని రంగాపురం గ్రామంలోని రామాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గురువారం ఉదయం దేవాలయాన్ని శుభ్రపర్చేందుకు ఓ మహిళ వెళ్లగా.. దేవాలయంలో ఉండాల్సిన హుండీ దేవాలయం వెనకాల ఉంది. దీంతో పూజారి కోటేశ్వరశర్మ, గ్రామస్తులకు ఆమె తెలిపింది. గ్రామానికి చెందిన బందారపు శ్రీనివాస్, బలరాం, నర్సింహరావు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై తిరుపతి ఆలయ పరిసరాలను పరిశీలించి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. కాగా.. హుండీలో ఉండాల్సిన నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. క్లూస్‌టీం ఎస్సై శ్రీధర్ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. దేవాలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

వరంగల్(పర్వతగిరి): మండలంలోని జమలాపురం, సోమారం ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 16న ఉదయం 9గంటలకు సీనియర్ విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు బానోతు వెంకన్న, అసోసియేషన్ కార్యదర్శి రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు 99598 95593, 81850 81685, 85003 11875 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్యాంపు నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు వరంగల్ జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్. ఇందిర గరువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా ప్రతీ మండలంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు వివరాలతో ఈనెల 25లోపు దరఖాస్తులను ఓ సిటీ స్టేడియంలోని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అలాగే 14ఏళ్ల లోపు బాలబాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు.

బస్‌పాస్ మేళాను వినియోగించుకోవాలి



దుగ్గొండి: తెలంగాణ ఆర్టీసీ కల్పిస్తున్న బస్‌పాస్ రాయితీని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ విజయమాధురి అన్నారు. మండలంలోని శివాజీనగర్‌లో దివ్యాంగులకు గురువారం బస్‌పాస్ మేళా నిర్వహించారు. అర్హులకు అక్కడిక్కడే పాస్‌లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి ఉమా రవీందర్, కోఆర్డినేటర్లు దేవేందర్, మాధవ్ పాల్గొన్నారు.

'ప్రగతి' పనులు కొనసాగించాలి



చెన్నారావుపేట: గ్రామాల్లో పల్లెప్రగతి పనులను నిత్యం కొనసాగించాలని డీపీఓ కల్పన సూచించారు. ఈమేరకు చెన్నారావుపేట గ్రామ పంచాయతీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీ, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు గ్రామ పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుండె మల్లయ్య, ఎంపీఓ శ్రీధర్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు..



నిమ్మకాయ సోడా తాగుతున్న విద్యార్థులు



గొడుగు పట్టుకుని బండిపై వెళ్తున్న మహిళ



నిప్పుల కుంపటి!



జిల్లాలో 42 డిగ్రీల పగటి ఉష్ణోతలు

- ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి
- పగలు బయటకెళ్లాలంటే జంకుతున్న జనాలు
- వేడిని తట్టుకునేందుకు తంటాలు



జిల్లాలో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు

సోమవారం	38
మంగళవారం	39
బుధవారం	41
గురువారం	40.5

జనసంచారం ఎక్కువగా లేక నర్సంపేటలో బోసిపోయిన మహబూబాబాద్, పాకాల సెంటర్

నర్సంపేట: నాలుగు రోజులుగా ఉదయం 8 గంటలు దాటకముందే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. భగ భగమంటూ నెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు. మండుతున్న ఎండలతో జనం బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగతలు నమోదవుతుండడంతో చిరు వ్యాపారులకు చిక్కులు ఎదురవుతున్నాయి. వరంగల్ జిల్లాలో గురువారం 40 డిగ్రీల ఉష్ణోగత దాటి నమోదు కావడంతో సాధారణం కంటే అత్యధికంగా ఎండలు ఉంటున్నాయి. పల్లెలు పట్టణాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండి నిప్పుల కుంపటిని తలపిస్తోంది. రోజంతా ఎండ వేడి, వడగాల్పులతో జనం అల్లాడుతున్నారు. రోజంతా కష్టపడితే తప్ప పూట గడవని వీధి వ్యాపారులు ఎండలోనే వ్యాపారం కొనసాగిస్తున్నారు. మార్చిలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ అకాల వర్షాల కారణంగా కొంత ఊరట లభించింది. కానీ ఈనెలలో మాత్రం రోజురోజుకూ ఎండ పెరిగిపోతోంది.

వడదెబ్బ ముప్పు

మండుతున్న ఎండలతో గ్రామీణ ప్రాంతంగా పేరొందిన వరంగల్ జిల్లాలో కూలీ పనులకు వెళ్లే వారి పరిస్థితి దారుణంగా మారింది. ప్రతీ ఏడాది వేసవిలో ఎక్కువ తీవ్రత ఉన్న జాబితాలో వరంగల్ జిల్లా ఉంటున్నప్పటికీ నాలుగు రోజులుగా నమోదవుతున్న ఉష్ణోగతలు మరింత ప్రమాదకరంగా మారాయి. బుధవారం నుంచి వీస్తున్న వడగాల్పులకు మృతుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. కాగా.. ఎండకు బయటకు వెళ్తే తగుజాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పిట్టల్లా రాలుతున్నారు..

జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో జనాలు ఎండకు బలవుతున్నారు. మంగళవారం జిల్లాలోని దుగ్గొండి మండలానికి చెందిన ముప్పారపు సారయ్య(67) మిర్చి ఏరడానికి కూలీ పనులకు వెళ్లి వడదెబ్బతో మృతి చెందాడు. గురువారం నెక్కొండకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు దేవులపల్లి భిక్షపతి వడదెబ్బతో మృతి చెందాడు.

గిరాకీ తగ్గింది..



ఎండ తీవ్రత కారణంగా చేపల వ్యాపారం చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. పొద్దంతా ఎండలో కూర్చుని చేపలు అమ్మడం వల్ల ఆరోగ్యం పాడవుతోంది. ఎండ అధికంగా ఉండడంతో గిరాకీ చాలావరకు తగ్గింది.

– యశోద, చేపల వ్యాపారి

భూములు ఎందుకివ్వాలి?

- గ్రీన్ ఫీల్డ్ హైవేతో స్థానికులకు ఏప్రయోజనం లేదు
- నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి: రైతుల డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న నిర్వాసిత రైతులు

సంగెం: నాగపూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములివ్వమని.. ఒక వేళ ఇవ్వాల్సి వస్తే నిర్వాసిత రైతులకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని తిమ్మాపూర్, తీగరాజుపల్లి గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. గురువారం జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ అవార్డు విచారణ కార్యక్రమాన్ని వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ.. తమకు తరతరాల నుంచి ఉపాధినిస్తున్న భూములను స్థానికంగా ఎలాంటి ప్రయోజనం లేని హైవేకు ఎందుకివ్వాలని ప్రశ్నించారు. బలవంతంగా లాక్కుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. తప్పనిసరి పరిస్థితుల్లో భూమి తీసుకోవాల్సి వస్తే ఎకరానికి కోటిన్నర మార్కెట్ ధర చెల్లించాలని విన్నవించారు. వరంగల్ ఆర్డీఓ మహేందర్‌జీ మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో తిమ్మాపూర్ శివారులో 87 మంది రైతులకు చెందిన 33.18 ఎకరాల భూమి కోల్పోతున్నారని వీరికి ఎకరానికి పరిహారంగా రూ.19.18లక్షల చొప్పున, తీగరాజుపల్లి శివారులో 30 మంది రైతులకు చెందిన 8.14 ఎకరాల భూమికిగాను ఎకరానికి పరిహారంగా రూ 8.59 లక్షల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనికి రైతులు తమ భూములు ఇవ్వమని చెప్పడంతో ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పి ఆర్డీఓ రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సంగెం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ దివ్య, రిటైర్డ్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

రైతు ఉపకరణాల అద్దె కేంద్రం సందర్శన

- వివరాలు తెలుసుకున్న కార్గిల్, లద్దాక్ అధికారులు



చెన్నారావుపేటలో కార్గిల్, లద్దాక్ అధికారులు

చెన్నారావుపేట: చెన్నారావుపేటలోని 'అక్షయ' ఎఫ్‌పీఓ నిర్వహిస్తున్న రైతు ఉపకరణాల అద్దె కేంద్రాన్ని గురువారం కార్గిల్, లద్దాక్ అధికారులు పరిశీలించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా లడాక్ కార్గిల్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న అధికారులు, బాధ్యులు, గురువారం ఓరుగల్లు మండల సమాఖ్య ఆధ్వర్యంలో సంఘాల అభివృద్ధిని, సమాఖ్యలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. క్షేత్ర పర్యటన బృంద సభ్యులతో ఏపీఎం ఈశ్వర్ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన మహిళా సంఘాల ద్వారా సక్సెస్ సాధించామన్నారు. ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా రైతు ఉపకరణాల కేంద్రాన్ని చెన్నారావుపేటలో ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 219 సెంటర్లలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. బయటికన్నా తక్కువ ధరలో రైతులకు అద్దెకివ్వడం జరుగుతోందన్నారు. కార్గిల్ ఎస్‌పీఎం అంకుశ్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయం, ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌తో చెన్నారావుపేట మహిళలు ఆదర్శంగా ఉన్నట్లు తెలిపారు. 'మా ప్రాంతాల్లో మరింత అభివృద్ధి సాధించడానికి ఈక్షేత్ర పర్యటన చాలా ఉపయోగపడుతుంది' అని లద్దాక్, కార్గిల్ అధికారులు అన్నారు. అభిషేక్‌కుమార్, డోల్‌కార్, సునిల్‌కుమార్, మునీర్ రసూల్, మీనాక్షి, ఆసియాతో పాటు 30 మంది ఈపర్యటనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మేనేజర్ బోళ్ల ఐలయ్య, అధ్యక్షురాలు ఖర్షూరి హైమ, మంజుల ఎంఎస్‌ఏ రజిత, ఉమా, విజయ, సీఆర్‌పీలు శ్రీనివాస్ ఉన్నారు.

మక్కకు గిట్టుబాటు ధర కల్పించండి

- తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పైడి
- ఆర్డీఓకు వినతి



రైతులతో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

నర్సంపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో మక్క రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. ఈమేరకు నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ ప్రతినిధి బృందం గురువారం సందర్శించి మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలు, దోపిడీపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పైడి మాట్లాడుతూ.. నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో కొద్ది రోజులుగా మార్కెట్ అధికారులు, మక్కల వ్యాపారులు కుమ్మక్కై మక్కల ధరలు తగ్గిస్తూ కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు, వ్యాపారులు, అడ్తిదారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గిస్తూ వస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న పంటకు క్వింటాకు రూ.3వేలు చెల్లించి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, జిల్లా నాయకులు భూమా అశోక్, శివరాత్రి కుమార్, బర్ల గొరయ్య, అజ్మీర పూల్‌సింగ్, అందె లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



రాయపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

రాయపర్తి: సీఎం కేసీఆర్ పాలనలో ప్రజారంజకమైన సంక్షేమ పథకాలు చేపడుతూ.. సబ్బండ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో సాగు నీటి ప్రాజెక్టుల కల్పనతో మూడు లక్షల ఎకరాల సాగును ప్రస్తుతం 65 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. అనంతరం మండల కేంద్రంలో రంజాన్ పండుగ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నరసింహనాయక్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, గ్రామ సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీలు బిల్లా రాధిక సుభాష్‌రెడ్డి, ఐత రాంచందర్, మజీద్ సదరులు ఎండీ లాయక్ అలీ, నయీమ్ పాల్గొన్నారు.

పంటకు నీరందడం లేదని రైతు ఆత్మహత్యాయత్నం



మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న రైతు సుక్య

ఖానాపురం: పంటకు నీరందడంలేదని మండలంలోని బాల్ తండాకు చెందిన రైతు సుక్య గురువారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. సుక్య ధర్మరావుపేట శివారు సంగెం కాల్వ పోరుబండ ఏరియా సమీపంలో ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకుని అందులో వరి సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో చివరి ఆయకట్టుకు నీరందక పంట ఎండుతోంది. దీంతో పొలం దగ్గరికి వెళ్లి గడ్డిమందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా.. గమనించిన తోటి రైతులు అడ్డుకుని ఇంటికి తీసుకెళ్లారు. ఈవిషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

నేడు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

వరంగల్: అంబేడ్కర్‌జయంతి సందర్భంగా కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈకార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, దళిత సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొంది.

నిరుద్యోగులకు రూ.లక్ష పరిహారం చెల్లించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులకు ప్రభుత్వం రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ మార్చ్‌కు తరలిరావాలనే వాల్‌పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ మండల అధ్యక్షుడు చీటూరి రాజు, రాయపురపు కుమారస్వామి, నాంపెల్లి యాకయ్య, రాజేశ్వర్‌రావు, రాంబాబు, కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, పంజా వెంకటేశ్వర్లు, రాజు, రవికుమార్, గిరిప్రసాద్, అనిల్, శ్రీనివాస్, రామకృష్ణ, కర్క సోమిరెడ్డి, ప్రశాంత్, విక్రం పాల్గొన్నారు.

స్నానానికి వెళ్లి గొర్రెల కాపరి గల్లంతు



మల్లయ్య

వర్ధన్నపేట: స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన రాయపురం మల్లయ్య గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. మల్లయ్య గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం స్నానం చేసేందుకు కెనాల్‌లో దిగుతుండగా.. ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. కేకలు వేయడంతో.. గమనించిన గొర్ల కాపరులు రాయపురం సమ్మయ్య, బొంతల సంతోశ్ కెనాల్‌లోకి దిగి మల్లయ్యను కాపాడేందుకు యత్నించారు. ఈక్రమంలో సంతోశ్ సైతం ప్రమాద స్థితికి చేరి సాయం కోరాడు. గమనించిన కుమారస్వామి సంతోశ్‌ను లుంగీ, టవల్ సాయంతో కాపాడాడు. కాగా.. ఎంత వెతికినా మల్లయ్య ఆచూకీ లభించలేదు. గల్లంతైన వ్యక్తి సోదరుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 96666 58048కు ఫోన్ చేయాలని కోరారు.

జిల్లాకు 6వేల రంజాన్ తోఫాలు

వరంగల్: వరంగల్ జిల్లాలోని ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా అందించే తోఫాలు రూ.6వేలు ప్రభుత్వం నుంచి వచ్చినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి రూ.3 వేలు, నర్సంపేటకు రూ.1,500లు, వర్ధన్నపేటకు 1,500 తోఫాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం నుంచి ఇఫ్తార్ విందుల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్ల పర్యవేక్షణలో సంబంధిత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తోఫాల పంపిణీ, ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సర్పంచ్ కాలర్ పట్టి.. నిలదీసి

- ఉప సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేసిన సర్పంచ్
- విచారణకు వచ్చిన వార్డు సభ్యురాలిపై అసభ్య పదజాలంతో దూషణ
- కోపోద్రిక్తురాలై సర్పంచ్ కాలర్ పట్టిన వార్డు సభ్యురాలు సావిత్రి



సర్పంచ్ కాలర్ పట్టిన సావిత్రి

వరంగల్ (పర్వతగిరి): ఉప సర్పంచ్‌కు తెలియకుండా సర్పంచ్ గ్రామ నిధులను డ్రా చేశాడు. దీనిపై అధికారులు విచారణ చేస్తుండగా.. అక్కడే ఉన్న వార్డు సభ్యురాలిని సర్పంచ్ అసభ్య పదజాలంతో దూషించడంతో కోపోద్రిక్తురాలైన ఆమె అతడి కాలర్ పట్టుకుని నిలదీసింది. ఈఘటన పర్వతగిరి మండలంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇస్లావత్‌తండా గ్రామ పంచాయతీ నిధులను ఉపసర్పంచ్ పీర్యాకు తెలియకుండానే తన సంతకం ఫోర్జరీ చేసి సర్పంచ్ ఇస్లావత్ రమేశ్ డబ్బులు డ్రా చేశాడు. దీనిపై పీర్యా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం ఉదయం ఈవిషయమై విచారణ చేపట్టేందుకు ఎంపీఓ.. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. కాగా.. సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శుల వాంగ్మూలం నమోదు చేస్తున్న క్రమంలో సర్పంచ్ రమేశ్, వార్డు సభ్యురాలు అయిన ఇస్లావత్ సావిత్రిని అసభ్య పదజాలంతో దూషించాడు. సావిత్రి కోపంతో సర్పంచ్ కాలర్ పట్టుకుని నిలదీసింది. ఈక్రమంలో ఎంపీఓ విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని చెప్పి వెళ్లిపోయారు. అనంతరం సర్పంచ్ రమేశ్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయానికి వచ్చిన స్థానికులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారు. సర్పంచ్ రమేశ్ ఓ ఆంజనేయస్వామి మాల ధరించిన భక్తుడిపై పిడిగుద్దులతో దాడి చేశాడు. కాగా.. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సర్పంచ్ తన సొంత ఇంట్లో పెట్టుకుని గ్రామస్తులు, సిబ్బందిపై అనుచితంగా వ్యవహరిస్తున్నాడని తండావాసులు చెబుతున్నారు.

లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గీసుకొండ: జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్య కార్యక్రమాలపై వైద్యాధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పేరు నమోదు చేసిన గర్భిణులకు అవసరమైన వైద్య సేవలందించాలన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చూడాలని, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి వైద్య సేవలు అందించాలన్నారు. భ్రూణహత్యలు,మాతాశిశు మరణాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్,ప్రోగ్రాం అధికారులు పద్మశ్రీ, చల్లా మధుసూదన్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావును కలిసి వస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అసోషియేషన్ డిస్కం కార్యదర్శి బక్క దానయ్య కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ డిస్కం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. సొంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావును కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోషియేషన్ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు స్వదేశ్ కుమార్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రవి, చలపతి, విజయ్ రాజ్, రాజు, శ్యామ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల గోస

అన్నదాతలకు లాట్ ఐడీలు ఇవ్వని సిబ్బంది
- జీరో దందా కోసమేనని ఆరోపణలు
- అడ్తిదారుల కనుసన్నల్లోనే మిర్చి అమ్మకాలు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్ పాలకవర్గం

సాక్షి పరిశీలన



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు.

వరంగల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు పంటను అమ్ముకోవడంలో అండగా ఉండేందుకు మార్కెట్ కమిటీలు, రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి కన్వీనర్లను నియమిస్తున్నా.. వారు పెద్ద పెద్ద వాహనాల్లో అధికారదర్పం ఒలగబెట్టడమే కాని ఏనాడు మార్కెట్‌లో రైతుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో గురువారం ‘సాక్షి’ పరిశీలించి లాట్ ఐడీలపై రైతులను ప్రశ్నించగా మెజార్టీ రైతుల నుంచి ఇవ్వలేదన్న సమాధానం వచ్చింది.

ప్రతిరోజూ 35నుంచి 50వేల బస్తాల మిర్చి

సీజన్‌లో మిర్చి బస్తాలను గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావడంతో అలసిపోతున్నారు. అడ్తిదారుని గుమస్తాలు రాగానే తమ బస్తాలను ఆయనకు అప్పగించి కాలకృత్యాలు తీర్చుకోవడం, టీ, టిఫిన్ చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ జరిగే తంతును పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు మిర్చి ధరను నిర్ణయించేందుకు జెండా పాట పాడి గరిష్ట ధరకు ఒక లాట్ ఖరీదుదారుడు కొనుగోలు చేస్తారు. అనంతరం మార్కెట్‌లోని సేట్లు ఇంటికి, మార్కెట్ సిబ్బంది యార్డుల్లోకి, అధికారులు ఆఫీసుల్లోకి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మిర్చి దాదాపు ప్రతిరోజూ 35 నుంచి 50వేల బస్తాలు వస్తున్నాయి. యార్డుల్లోకి వచ్చిన మిర్చి బస్తాలు అప్పుడప్పుడు మాయం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల కెమెరాలు పనిచేస్తున్నందున కొన్ని బస్తాలు మాయమైన సందర్భంలో ఇరు వర్గాలను సమన్వయం చేసి మార్కెట్ అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న పరిస్థితి ఉంది.

జీరో దందాకు రాచమార్గం

రైతులకు లాట్ ఐడీలు జారీ చేస్తే తప్పనిసరిగా తూకం వేసి పీవోఎస్ మిషన్లలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల జీరో దందాకు అవకాశం లేకుండా పోతుంది. దీంతో కొంత మంది ట్రేడర్స్, వారి గుమస్తాలు, మార్కెట్‌లోని కొంత మందితో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఐడీల జారీలో అలసత్వం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది లాట్ ఐడీలు ఇచ్చారా.. లేదా అన్న విషయాలను యార్డుల్లో అధికారులు తిరిగితే తెలుస్తుంది. అధికారులు మాత్రం యార్డు ఆఫీసులకే పరిమితం కావడంతో మొత్తం దడవాయిలు, హమాలీలు, గుమస్తాల కనుసన్నల్లోనే గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలిసింది.



లాట్ ఐడీ(నమూనా)

లాట్ ఐడీల్లో అన్ని వివరాలు

రైతులు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి యార్డుల వద్ద పెట్టగానే మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు తప్పకుండా జారీ చేయాల్సి ఉంటుంది. లాట్ ఐడీ ఇస్తే అందులో రైతు పేరు, అడ్తిదారుని పేరు, తెచ్చిన మిర్చి రకం, ఎంత సరకు తెచ్చారనే వివరాలు ఉంటాయి. కాంటాలు పెట్టే సమయంలో లాట్ ఐడీలో పేర్కొన్న బస్తాలు ఉన్నాయా..రకం ..ఇతరత్రా విషయాలను రైతులు గమనించే అవకాశం ఉంటుంది. మార్కెట్ ఉన్నతాధికారులు లాట్ ఐడీలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పాలకవర్గం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాట్ ఐడీలు ఇవ్వలేదు..



15 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. నాకు లాట్ ఐడీ ఇవ్వలేదు. ధరలు అయ్యాయి. ఇంకా కాంటాలు కాలేదు. గత ఏడాదిలో ఒక సారి లాట్ ఐడీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రెండు సార్లు మార్కెట్‌కు మిర్చి అమ్మేందుకు వచ్చినా ఐడీలు ఇవ్వలేదు.

\- యాకయ్య, లడాయిగడ్డ, కొత్తగూడ

అంతా సేటుకే ఎరుక..



46 బస్తాల సన్న మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ధర క్వింటాకు రూ.20,300లు అన్నారు. ఇంకా కాంటాలు కాలేదు. లాట్ ఐడీ ఇవ్వలేదు. మిర్చి బస్తాలు తెచ్చి సేటుకు అప్పగించడం వరకే తెలుసు. ఇవన్నీ ఏమి తెలియదు.

\- వీరన్న నాయక్, గోప్యాతండా, కేసముద్రం

ధర అడ్తిదారులకే తెలుసు..



మార్కెట్‌కు 8 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. లాట్ ఐడీ ఇవ్వలేదు. అసలు ఎప్పుడూ కూడా లాట్ ఐడీలు ఇవ్వలేదు. మిర్చి బస్తాలు కాంటాలు కాలేదు. ధర కూడా అడ్తిదారులకే తెలుసు.

\- రాజఅయిలు, గొల్లపల్లి, గణపురం

బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు రేపు హనుమకొండలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చని కేంద్రాన్ని నిరుద్యోగులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇటీవల చేపట్టిన ప్రజాపోరు యాత్ర వల్లే కేంద్రంలో, రాష్ట్రంలో విభజన హామీలపై చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని కూడా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా 12రోజుల పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న 200 మంది నాయకులు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయసారధి, నేదునూరి జ్యోతి, మేకల రవి, కర్రె భిక్షపతి, రాజారెడ్డి, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌రావు, రమేశ్, తోట భిక్షపతి, ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘యువిక-2023’కి నిఖిల్ ఎంపిక

- అభినందించిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్



కాజీపేట సెంటర్: బాల్యదశలోనే సైన్స్, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచి విద్యార్థులను ఈ రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ వేసవి సెలవుల్లో చేపడుతున్న యువిక–2023 కార్యక్రమానికి వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బట్టు నిఖిల్ ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా కేవలం 9వ తరగతి విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన ఈ యువిక (యువ విజ్ఞాన కార్యక్రమం)లో రెండు వారాల పాటు వచ్చే మే నెలలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు వివిధ కేంద్రాల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు స్పేస్ సైన్స్, స్పేస్ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో 350మంది విద్యార్థుల్లో 22వ ర్యాంకు సాధించి నిఖిల్ ఎంపిక కావడం పట్ల డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి నిఖిల్‌ను అభినందించారు. ఈ శిక్షణలో నిఖిల్‌కు అయ్యే పూర్తి ఖర్చులు ఇస్రో భరించనుంది.

ఎద్దు పొడిచి బీటెక్ విద్యార్థి మృతి

- మేతకు ఎడ్లను తీసుకెళ్లగా ఘటన



భానుప్రకాశ్(ఫైల్)



భానుప్రకాశ్ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: మేత మేపేందుకు తీసుకెళ్లిన ఎద్దు పొడవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పనికరి పద్మ, కొమురమల్లు దంపతులకు కుమారుడు భానుప్రకాశ్(19), కూతురు ఆలేఖ్య ఉన్నారు. భానుప్రకాశ్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంటివద్ద ఉండగా, తమకున్న రెండు ఎడ్లను మేపేందుకు భానుప్రకాశ్ పంటచేను వద్దకు తీసుకెళ్లాడు. ఎద్దు మూతికి కట్టిన బుట్టి విప్పే క్రమంలో ఆ ఎద్దు ఛాతిభాగంలో పొడవడంతో అతను కింద పడిపోయి, గట్టిగా కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న అతడి పెదనాన్న యాకమల్లు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి భానుప్రకాశ్‌ను బైక్‌పై కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మహబూబాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కాలేజీకి వెళ్లినా బతికేటోడు..

బీటెక్ ఫస్టియర్ చదువుతున్న భానుప్రకాశ్ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లాలనుకున్నాడు. కొత్త డ్రెస్ కొనుక్కొని శుక్రవారం వెళ్లొచ్చని ఇంట్లో చెప్పడంతో ఇంటి వద్ద ఉండిపోయాడు. అతను ఒకవైపు చదువుకోవడంతోపాటు, తన వంతుగా వ్యవసాయ పనులను చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు ఎడ్లను మేపేందుకు వెళ్లిన అతన్ని ఎద్దుపొడవడంతో మృతిచెందాడు. కాలేజీకి వెళ్లినా బతికేటోడివంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారందరిని కంటతడిపెట్టించింది. భానుప్రకాశ్ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరికోత మిషన్ నడపడానికి వెళ్లి..



ఆంజనేయులు(ఫైల్)

బచ్చన్నపేట: మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరికోత మిషన్ నడపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(40) డ్రైవింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల క్రితం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గొల్లపూడికి చెందిన ఏజెంటు చల్ల కృష్ణ ఇంటికి వరికోత మిషన్ నడపడానికి వెళ్లాడు. పనిలో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వద్ద వరికోతలు కోస్తున్నాడు. విరామ సమయంలో సాగర్ కాల్వపై స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ అందులో పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అండర్ టన్నల్‌లో చిక్కుకుని శ్వాస ఆడక మృతి చెందాడు. ఈ సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతునికి భార్య మమత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్..



హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన దామెర మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్ రోడ్డుకు చెందిన గుగ్గిళ్ల ప్రసాద్ (53) ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి విధులు ముగించుకొని హనుమకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గుంతలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ అవయవాలు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు.

వడదెబ్బతో ఒకరు..



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండకు చెందిన దేవులపల్లి భిక్షపతి (43) వడదెబ్బకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు సూచించడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భిక్షపతి మృతి చెందాడు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు భిక్షపతి మృతదేహాన్ని సందర్శించారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.10 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ రూరల్: మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాధించాలని స్నేహితుడి ఇంట్లో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఆ నిందితుడిని గురువారం పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ సీతారాం వివరాలు వెల్లడించారు. బచ్చన్నపేట గ్రామానికి చెందిన సందెల రాజేష్(అలియాస్ రాజు) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వచ్చే ఆదాయం సరిపోవక పోవడంతో చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. భవాని నగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్ ఈ నెల 9వ తేదిన తన స్నేహితుడు వంశీ ఇంటి తాళం పగులగొట్టి రూ.10లక్షలు ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా డీసీపీ సూచన మేరకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, ఎస్సై రఘుపతి, సృజన్ సిబ్బందితో జనగామ బస్టాండ్ వద్ద నిందితుడిని పట్టుకొని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై రఘుపతి, సృజన్, సల్మాన్ పాషా, శ్రీనివాస రాజు, కానిస్టేబుళ్లు మహేష్, రామన్న, కర్ణాకర్, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్‌లను వారు అభినందించారు.

బట్టల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ఎంపి గుప్తా రెడీమేడ్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వల్పంగా దగ్ధమైంది. దుకాణ యజమాని సోదరుడు అభిషేక్ అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి మెయిన్ ఆన్ చేశారు. కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ ఆన్ చేశారు. తిరిగి విద్యుత్ రావడంతో దుకాణంలోని మూడో అంతస్తులోని గోడౌన్‌లో మంటలు రావడాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు నేతృత్వంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ నెలలో రంజాన్ పండుగ ఉండడంతో కొత్త స్టాక్ తెప్పించామని వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం జరిగిందని అభిషేక్ అగర్వాల్ తెలిపారు.

పట్టుదలతో చదివితేనే బంగారు భవిష్యత్



మంత్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా సీజేఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు

జనగామ: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని బంగారు భవిష్యత్ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి బిషప్ ఉడుముల బాల అధ్యక్షతన జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆషామాషీగా తీసుకుంటే, ఆగమైపోతారన్నారు. కళాశాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, బీటీ రోడ్డు సైతం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులన్నారు. బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ సీజేఐటీలో 25 ఏళ్ల కాలంలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ప్రపంచంలోనే అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీజేఐటీ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, సీజేఐటీ డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాల్లో సీజేఐటీ ఒక్కటిగా నిలిచి పోతుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, విద్యా వేత్తలను కాలేజీ నిర్వాహకులు శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవాల కన్వీనర్లు బి.స్వప్న, కరుణాకర్, ఏఎస్ రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరివేసుకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డులోని ఆర్టీసీ కండక్టర్ రేసు శ్రీనివాస్ (51) నర్సంపేట డిపోలో విధులు నిర్వహించి కొన్ని సంవత్సరాల క్రితం తొర్రూర్ డిపోకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. అయితే శ్రీనివాస్‌కు ఆరోగ్య స్థితి బాగలేక పోవడంతో విధులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13న విధుల నుంచి తొలగించారు. దీంతో అనారోగ్య, విధుల నుంచి తొలగించడంతో మనోవేదనకు గురై శ్రీనివాస్ ఇంట్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.